## క్లుప్తంగా

### ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి

• కొండపాలెంలో ఉపాధ్యాయ బృందం ప్రచారం



కొండపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ బృందం

**రోలుగుంట:** ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి- మంచి చదువులతో ఉన్నత స్థాయికి ఎదగండి అని హెచ్ఎం ఈశ్వరప్రసాద్ కోరారు. కొండపాలెం పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఆయన శనివారం గ్రామంలో ఇంటింటా తిరిగారు. బడిఈడు పిల్లలను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా చిన్నారుల తల్లిదండ్రులను కలసి ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపించి పడుతున్న కష్టాలు, ఫలితాలు, స్థానికంగా అందుతున్న ఉచిత విద్య, ఫలితాల వ్యత్యాసాన్ని వివరించారు. గ్రామ పెద్దలతో మాట్లాడి పిల్లల పేర్లు, వారి అడ్రస్‌లను నమోదు చేసుకుని చైతన్యపరుస్తున్నారు. ఉపాధ్యాయులు రాము, జ్యోతి, రమణి పాల్గొన్నారు.

### బుచ్చెయ్యపేట కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న వెంకటరావు

**బుచ్చెయ్యపేట:** సార్వత్రిక ఎన్నికల్లో అంకిత భావంతో పనిచేసిన బుచ్చెయ్యపేట కానిస్టేబుల్ జి.వెంకటరావును ఎస్పీ కేవీ మురళీకృష్ణ అభినందించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా పలు గ్రామాల్లో వెంకటరావు విధులు సమర్థవంతంగా నిర్వర్తించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చేసి అధికారుల మన్నలను పొందారు. సమస్యాత్మక గ్రామాల్లో గొడవలు, అల్లర్లు జరగకుండా కృషి చేశారు. ఈ మేరకు విధులు సంక్రమంగా నిర్వర్తించడంతో ఎస్పీ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కానిస్టేబుల్ వెంకటరావును బుచ్చెయ్యపేట ఎస్ఐ బి.ఈశ్వరరావు, కొత్తకోట సీఐ అప్పలనాయుడు, సిబ్బంది శనివారం అభినందించారు.


### విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రంథాలయాధికారి పద్మావతి

**కె.కోటపాడు:** విద్యార్థుల్లో విజ్ఞాన వికాసానికి వేసవి విజ్ఞాన శిబిరం దోహదపడుతుందని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. చౌడువాడ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రీడలు, వ్యాసరచన, వక్తృత్వ, యోగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. వేసవి సెలవుల్లో ప్రత్యేకంగా విద్యార్థులకు శాఖా గ్రంథాలయాల ద్వారా వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

### మోదమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మోదమాంబ

**మాడుగుల రూరల్:** వి.వి. అగ్రహారం గ్రామంలోని గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు స్వగృహంలో ఏర్పాటు చేసిన మోదమాంబ అమ్మవారి పీఠంలో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 16వ తేదీ వరకు ఇక్కడ పూజలు నిర్వహించి, 17న మాలధారణ విసర్జిస్తామని గురుమాత శ్రీనివాసరావు తెలిపారు. అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమం త్వరలో నిర్వహిస్తామన్నారు. కె.జె.పురం మోదమాంబ ఆలయంలో మాలధారణ భక్తులు ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు.



# మలేరియా రహిత సమాజ నిర్మాణానికి కృషి

దేవరాపల్లిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ అవగాహన ర్యాలీ



దేవరాపల్లిలో మలేరియా అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి పూజ్యమేఘన

**దేవరాపల్లి:** మలేరియా రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి ఇ. పూజ్యమేఘన తెలిపారు. ఈ మేరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం దేవరాపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పూజ్యమేఘన మాట్లాడుతూ ఈ నెల ఒకటిన ప్రారంభమైన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధన కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని సాగిద్దామన్నారు. దీనికి ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. నిల్వ నీటిలోనే లార్వా వృద్ధి చెందుతుందన్నారు. ఇది వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటిలో ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. ఇళ్లలో దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వినియోగించడంతోపాటు కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అవగాహన ర్యాలీలో సీహెచ్‌వో పి. ప్రసాదరావు, హెచ్‌వీ బి. లక్ష్మి, పీహెచ్ఎన్ బి. సునీత, హెల్త్ సూపర్‌వైజర్లు పుష్పరాజ్, అప్పారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దు



ఎంపీడీవో రాంబాబు

**నాతవరం:** గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. ఆయన శనివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగియడంతో పనులు యధావిధిగా చేసేందుకు సిబ్బందికి సూచనలు చేశామన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో దృష్టి సారించాలన్నారు. ప్రజలకు నీరందించేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయని, గ్రామాల్లో రోగాలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండి వరి విత్తనాలు సక్రమంగా అందేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదన్నారు. త్వరలో పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు సంబంధించి పుస్తకాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## తురాయి సోయగం



**కె.కోటపాడు:** గుల్లేపల్లి-చింతపాలెం మార్గంలో తురాయి చెట్ల పూలు ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా నాటిన తురాయి చెట్లు వేసవిలో చల్లని నీడతో వాహనదారులను ఆహ్లాదపరుస్తున్నాయి. ఈ చెట్లు నుంచి పూసిన ఎరుపు రంగు పూలు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి.

## నేటి నుంచి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు



**మాడుగుల రూరల్:** కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామకొండలరావు, కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు స్వామివారి పెళ్లిరాట కార్యక్రమంతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తామన్నారు. ఈ నెల 16వ తేదీన ఉదయం పుట్టమట్టి తీసుకురావడం, అంకురార్పణ, నవకలశ స్నపనం, నిజరూప దర్శనం, పూజా కార్యక్రమాలు జరుగుతాయని, 17వ తేదీ ఉదయం ఎదురు సన్నాహం, అనంతరం 9 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం నుంచి ఆలయ సమీపంలో అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఆలయంలో భక్తిగీతాల ఆలాపన, అనంతరం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం ఉంటుందన్నారు. 22వ తేదీ ఉదయం నుంచి వసంతోత్సవం, నాగవల్లి సంబరాలు, రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, పవలింపు సేవతో ఉత్సవాలు ముగిస్తాయని పేర్కొన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు ముందుగా రూ.2 వేలు కమిటీ వారికి చెల్లించాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు బియ్యం, లేదా ధన రూపంలో సమర్పించాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో రుద్రహోమం



రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

**మాకవరపాలెం:** వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం వైభవంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం స్థానిక పెద్దమిల్లు జంక్షన్‌లో వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమంతోపాటు స్వయంభూ లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ అర్చకుడు దొరబాబుశర్మ పాల్గొన్నారు.

## ప్రమాద భరితంగా శిథిల వంతెనలు



పెదగొలుగొండపేట, చిన గొలుగొండపేట మధ్య ఏలేరు కాలువపై శిథిలమైన వంతెన

**నాతవరం:** ఏలేరు కాలువపై నిర్మించిన వంతెనలు శిథిలం కావడంతో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చిన గొలుగొండపేట, పెద గొలుగొండ మధ్యలో ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏలేరు కాలువపై వంతెన నిర్మించారు. ఇది శిథిలం కావడంతో వచ్చేపోయే ప్రయాణికులు భయపడుతున్నారు. ఇటీవల కొత్తగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురి కావడంతో మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 13 పంచాయతీల మీదుగా 25 కిలోమీటర్ల మేర పొడవున ఏలేరు కాలువ నీరు ప్రవహిస్తోంది. కాలువ నిర్మాణ సమయంలో చాలాచోట్ల ప్రజలు రాకపోకలకు వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు ఏలేరు కాలువపై వంతెనలు నిర్మించారు. ఆయా వంతెనలు ప్రస్తుతం చాలాచోట్ల శిథిలమయ్యాయి. అవి ఏ సమయంలో కూలితాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. పెద గొలుగొండపేట, ఎ.శరభవరం, జిల్లేడుపూడి ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ రోడ్లపై ఏలేరు కాలువకు వంతెనలు నిర్మించారు. గునుపూడి, పి.కే.గూడెం, ఎ.పి.పురం, లింగంపేట, మన్యపురట్ల, కొండ ధర్మవరం ప్రాంతంలో రాకపోకలు సాగించేందుకు కాలువపై వంతెనలు నిర్మించారు. ఆయా వంతెనలపై పెద్ద వాహనాలు అధిక లోడుతో రాకపోకలు సాగించడంతో కుంగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రమాదకరంగా మారిన వంతెనలకు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

## జలకాలాడుతూ..సేద దీరుతూ



ఏలేరు కాలువలో స్నానాలు చేస్తున్న పిల్లలు, పెద్దలు

**నర్సీపట్నం:** మృగశిర కార్తె ప్రారంభంలోను ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో ఎండలకు తాళలేక.. వేసవి సెలవులు కలిసి రావడంతో ఏలేరు కాలువలో విద్యార్థులు స్నానం చేస్తూ సేద తీరుతున్నారు. యకరన్నపాలెం వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ఇలా ఉపశమనం పొందుతున్నారు. ఇక్కడ కాలువ వంతెనపై నుంచి దూకుతూ సందడి చేస్తున్నారు. కొంత మంది పెద్దలు తమ పిల్లలకు ఈత నేర్పుతున్నారు. సూరీడు సుర్రుమంటూ నిప్పులు చెరగడంతో ఉక్కపోతను భరించలేక విద్యార్థులు, పెద్దలు కాలువలో స్నానం చేస్తున్నారు.

## 'బకాయి పడ్డ జీతాలు చెల్లించాలి'

**అనకాపల్లి :** జిల్లాలోని వివిధ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల జీతాలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని రాష్ట్ర పంచాయతీ, స్వచ్ఛ భారత్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర నాయకుడు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారని, అయినా ఆరు మాసాలుగా వారికి జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ విషయంపై కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని లేని పక్షంలో ఉద్యమం తప్పదన్నారు.

## బండారును సన్మానించిన రేషన్ డీలర్లు

**మాడుగుల రూరల్:** మాడుగుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారు సత్యనారాయణమూర్తిని శనివారం మండల డీలర్ల యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయన స్వగ్రామం పరవాడ మండలం వెన్నలపాలెంలో కలిశారు. బండారుకు శాలువా కప్పి, పూలమాలలు వేసి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మండల డీలర్ల యూనియన్ అధ్యక్షుడు చింతా వెంకటనారాయణమూర్తి, కార్యదర్శి పెంటకోట జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు వీర్ని సురేష్, కోశాధికారి పుట్టా ప్రకాష్, మహిళా ప్రతినిధి ఆడారి వెంకటరత్నం, నానాజీ, వద్దాది చారుమతిదేవి, కోట్ని భీమునాయుడు, ఆడారి చిరంజీవి, రేఖా పార్వతి, మండల సతీష్, జే త్రినాథ్, తాటికొండ శ్రీను పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

**కశింకోట :** మండలంలోని వెదురుపర్తి గ్రామంలో వెలసిన దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన వస్త్రాలు, పూలమాలలు, నిమ్మకాయ దండలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు శంకరరావు ఆధ్వర్యంలో కుంకుమార్చన, క్షీరాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పల్లెల రామోజీ (ఫైల్)

**అనకాపల్లి :** మండలంలో కుంచంగి గ్రామానికి చెందిన పల్లెల రామోజీ (48) క్వారీలో ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడంతో శనివారం తలకు తీవ్ర గాయమైంది. అక్కడే ఉన్న కూలీలు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావుకు మృతుడు భార్య పల్లెల నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## ప్రదక్షిణ మార్గంలో షెడ్ ఏర్పాటు

**కశింకోట :** స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ప్రదక్షిణ మార్గం చుట్టూ ఎండా వానల నుంచి రక్షణ కోసం షెడ్ నిర్మించారు. భక్తులు, దాతల సహకారంతో దీనిని సమకూర్చారు. ధ్యాన వేంకటేశ్వరస్వామిని శనివారం అందంగా వజ్ర కవచం, పూల మాలలు, తులసి మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

## బార్ వైస్ చైర్మన్‌కు అభినందనలు



బార్ కౌన్సిల్ స్టేట్ వైస్‌చైర్మన్ కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న సభ్యులు

**నర్సీపట్నం:** ఏపీ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కె.కృష్ణమోహన్‌ను నర్సీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నర్సీపట్నం కోర్టు సముదాయంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కలిసిన వారులో సెక్రటరీ లోకా లోవరాజు, చింతల ప్రకాష్, సుర్ల నాయుడు ఉన్నారు.

# వసతులుంటేనే కాన్వెంట్లకు అనుమతి

ఎంఈవో-1 జానుప్రసాద్



బుచ్చింపేట కాన్వెంట్‌లో ఆరా తీస్తున్న సర్వే బృందం

**రోలుగుంట:** అన్ని మౌలిక సదుపాయాలు కలిగిన కాన్వెంట్‌ల నిర్వహణకు అనుమతి ఉంటుందని, సర్వే చేసే వాటి నివేదికలు అందజేయాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మండలంలో కాన్వెంట్లపై మండల విద్యా శాఖ పర్యవేక్షణలో త్రీమెన్ కమిటీ శనివారం సర్వే చేపట్టింది. బుచ్చింపేట, కుసుర్లపూడి, జె.నాయుడుపాలెం, రోలుగుంటలో కాన్వెంట్లను శెట్టి మోహన్, కె.జగ్గారావు, ఎం.వెంకట్రావు బృందం సందర్శించింది. కాన్వెంట్‌లో రన్నింగు వాటర్, బెంచీలు, ఉపాధ్యాయుల స్టాఫ్ రూము, బాత్ రూములు, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించింది. హెచ్ఎం జానుప్రసాద్ ఈ టీం సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే నివేదికను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందజేస్తామని వివరించారు.

## ప్రజలు శాంతియుతంగా ఉండాలి

• నర్సీపట్నం రూరల్ సీఐ హరి



చీడిగుమ్మలలో పోలీసులు మార్చ్‌పాస్ట్ నిర్వహిస్తున్న దృశ్యం

**గొలుగొండ:** ఎన్నికల ఫలితాల తర్వాత కొన్ని గ్రామాల్లో ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ హరి, గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. శనివారం చీడిగుమ్మల, కొత్త ఎల్లవరం, సాలికమల్లవరం, పాలకపాడు, ఏటిగైరంపేట తదితర గ్రామాల్లో స్థానిక పోలీసులు, సీఐఎస్ఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా ఉండాలని మైక్‌ల ద్వారా ప్రచారం చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో ప్రజలు ఎక్కడా ఘర్షణలకు దిగొద్దని హెచ్చరించారు. ప్రతీ గ్రామంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గొలుగొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం



ఎ.భీమవరంలో ఆరోగ్య పరీక్షలను చేస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

**కె.కోటపాడు:** ప్రజలు సురక్షిత ఆరోగ్యాన్ని పొందేందుకు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఎ.భీమవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. 122 మందికి వైద్య పరీక్షలతోపాటు మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా బి.పి, సుగర్ పరీక్షలతోపాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించుకునేందుకు ప్రజలు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డీఎస్ఎన్.రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టరు పదవికి రాజీనామా

**రోలుగుంట:** కొప్పుల వెలమ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టరు పదవికి రాజీనామా చేసినట్టు టి.వి.రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల వారికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీయే అన్నారు. అన్ని కులాల వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించిందన్నారు. అందుకు నిదర్శనమే తనకు కార్పొరేషన్ డైరెక్టరు పదవి కట్టబెట్టడం అన్నారు. ఇన్నాళ్లూ పదవికి తగ్గట్టుగానే తాను సేవలందించానని, ప్రజలందరూ వైఎస్సార్‌సీపీవైపే మొగ్గు చూపించారన్నారు. ఫలితాలు మాత్రం కూటమిని వరించడం బాధాకరమన్నారు. భవిష్యత్‌లో తాను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కోసం పని చేస్తానన్నారు. తాజా ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే తమ పార్టీ నాయకులు, మాజీ మంత్రుల ఇళ్లపై దాడి చేసే విధానాలు కూటమి నాయకులు విరమించుకోవాలని కోరారు.

## సరుగుడులో మూగబోయిన సెల్‌ఫోన్లు



సరుగుడులో బిఎస్ఎన్ఎల్ సెల్ టవరు

**నాతవరం:** మండలంలోని సరుగుడులో సెల్‌ఫోన్లు మూగబోయాయి. మూడు రోజులుగా ఇక్కడ బీఎస్ఎన్ఎల్ టవరు పని చేయకపోవడంతో సిగ్నల్స్ అందక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సెల్ టవర్ ఆధారంగా సరుగుడు, సుందరకోట పంచాయతీల పరిధిలో 16 గ్రామాల్లో సేవలందుతున్నాయి. ప్రధానంగా సరుగుడు గ్రామ సచివాలయంలో ప్రభుత్వ పరంగా ప్రజలకు ఎలాంటి పనులైనా ఆన్‌లైన్ ద్వారా చేయాలి. నెట్ సిగ్నల్స్ లేక వాటిని సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. అదేవిధంగా ప్రైవేటు వ్యాపారులు, ఉపాధి హామీ పథకం కూలీలు సైతం అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పరంగా వచ్చే వివిధ పథకాల డబ్బులు సరుగుడులో మినీ బ్యాంకు ద్వారా లబ్ధిదారులు తీసుకుంటారు. ఈ సెల్ టవర్ పని చేయక వాటి లావాదేవీలు నిలిచిపోతున్నాయి. సరుగుడు, సుందరకోట పంచాయతీల్లో పింఛన్‌దారుల డబ్బులు సరుగుడు స్టేట్ బ్యాంకు పాయింట్‌లో రెండు నెలలుగా తీసుకుంటున్నారు. ఏ కొద్దిపాటి వర్షం పడినా ఈదురు గాలులు వీచినా సెల్ టవరు నుంచి సిగ్నల్స్ నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

## కులమతాలకు అతీతంగా మెలగాలి



రామారాయుడుపేటలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఏఎస్ఐ రామకృష్ణ

**మునగపాక :** గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా మెలగాలని ఏఎస్ఐ రామకృష్ణ కోరారు. సంఘ బహిష్కరణలకు అవకాశం లేకుండా అన్ని కులాల వారు సమన్వయంతో ఉండాలన్నారు. కుల బహిష్కరణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వచ్చిన కథనాలకు స్పందించిన పోలీసులు శనివారం సంబంధిత గ్రామానికి చేరుకుని ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ కుటుంబాల మధ్య ఉన్న విభేదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. అంతేగాని పత్రికలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. కుల,మతాలకు తావు లేకుండా కలిసి మెలిసి ఉండాలని చెప్పారు. తెలిసీ తెలియని జ్ఞానంతో కులపెద్దలపై కుందిరి దేముడు కుటుంబ సభ్యులు లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో గ్రామ పెద్దలు రాము, రాజు, నాగేశ్వరరావు, నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.